క్లుప్తంగా

కమనీయం.. సీతారామ కల్యాణం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సీతారాముల చిత్ర పటాలను గ్రామంలో ఊరేగించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

శ్రీకాళహస్తి: పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ కోత విధించారు. అసలే మండు వేసవి ఆపై ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతతో చిన్నపిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడ్డారు. మండు వేసవిలో ఇలా విద్యుత్‌ను తీసివేస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్‌కోతలను నివారించాలని కోరుతున్నారు.

కంటి ఆపరేషన్లకు 21మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరవింద్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పూజిత బాలికల జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం డైనిమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ ట్రస్టు వారు నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో 55 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందిని చెన్నైలోని శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు పీఆర్‌ఓ వెంకటముని తెలిపారు. యోగా గురువు సురేష్ నాయుడు, డైమినిక్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాస్, తేజ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

ఏర్పేడు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు, సంబంధిత పార్టీ శ్రేణులకు విజయోత్సవ సంబరాలకు అనుమతులులేవని ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 4న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండలంలోని ఏ పార్టీకి చెందిన వారూ రెచ్చగొట్టే ధోరణిలో ప్రవర్తించకూడదన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉండడంతో సమావేశాలు, సభలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని చెప్పారు. ఎన్నికల నియమావళిని వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన చదరంగం పోటీల్లో విజేతలకు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ నిర్వాహకులు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇచ్చి ఆదివారం పోటీలు నిర్వహించి విజేతలకు యూత్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందించేందుకు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు చదరంగంలో బాగా రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్యాంబాబు, బాలసుబ్రహ్మణ్యం, సురేష్‌బాబు, హేమకుమార్, సురేష్‌బాబు, నారాయణ, శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం బీజేపీ కేంద్ర కార్యాలయ కోఆర్డినేటర్ బాలరాజు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. బీజేపీ నాయకులు అమర్‌నాథ్, డిల్లీకుమార్, సాయి, చందు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్ ద్వారా రోగి వివరాలు డిజిటల్ విధానంలో తెలుసుకుంటున్న వైద్యాధికారి లావణ్య, ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక పరికరాలు, పేర్లు నమోదు చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్







ఒక్క క్లిక్‌తో సంపూర్ణ వైద్యం

పేదవర్గాల వారు వైద్యం కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పించింది. అనారోగ్యానికి గురైనప్పుడు ఆస్పత్రుల వద్ద ఎలాంటి నిరీక్షణ లేకుండా సత్వరం వైద్యసేవలు పొందేలా పీహెచ్‌సీలను డిజిటలైజ్ చేసింది. దీంతో రోగుల రుగ్మతలు, వారి శారీరక పరిస్థితులు, అందజేసిన మందుల వివరాలు (కేస్ హిస్టరీ) నిక్షిప్తం అవుతుంది. ఆ రోగి రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఆధార్ కార్డునంబర్ చెబితే చాలు గత రికార్డుల ద్వారా సులువుగా వైద్యం పొందవచ్చు.

- డిజిటల్ పీహెచ్‌సీలతో సత్వర సేవలు
- రిజిస్ట్రేషన్ నుంచి పరీక్షలు.. వైద్యం వరకు విప్లవాత్మక మార్పులు
- అత్యాధునిక వసతులు
- ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట



చిన్న పాండూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వరదయ్యపాళెం: ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే గంటల తరబడి పరీక్షలు, వైద్యం కోసం నిరీక్షించాల్సి వచ్చేది. అంత చేసినా సరైన వైద్యం అందుతున్న నమ్మకం ఉండేది కాదు. అందుబాటులో వైద్యులు ఉండేవారు కాదు. మందులు లభ్యమయ్యేవి కావు. ప్రతి పని చిట్టీల పైనే జరిగేది. రోగి పేరు రాయడం దగ్గర నుంచి వైద్యుడు మందులు రాసిచ్చే వరకు అంతా రాతపనే. ఒక వేళ ఆ చిట్టీ పోతే రోగి వివరాలు, అతను వాడే మందుల వివరాలు తెలుసుకోవడం కష్టమయ్యేది. దీంతో మళ్లీ పరీక్షలు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రజల ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. అత్యాధునిక వసతులతో పీహెచ్‌సీలు ఏర్పాటు చేసింది. ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటైంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది ఉచితంగా సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీలలో ప్రతి పని డిజిటలైజేషన్ చేయడంతో పేపర్‌లెస్ వర్క్ అందుబాటులోకి వచ్చింది. రోగి తన పేరు నమోదు చేసిన దగ్గర నుంచి అతనికి జరపాల్సిన పరీక్షలు, అందజేయాల్సిన మందుల వంటి వివరాలు ఆధార్ కార్డు ఆధారంగా మొత్తం కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. రోగి ఎప్పుడొచ్చినా ఆధార్ కార్డునంబర్ చెబితే అప్పటి వరకు అతనికి ఉన్న



ఆధునిక పరికరాలతో రక్త పరీక్షలు

వ్యాధులు, వాడిన మందుల హిస్టరీ బయటపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏ పీహెచ్‌సీకి వెళ్లినా అతని మెడికల్ హిస్టరీ తెలుసుకోవచ్చు. డిజిటలైజేషన్ ద్వారా వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ముక్తకంఠంతో పేర్కొంటున్నారు.

పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం

వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం అందుబాటులోకి వచ్చింది. అవసరమైన వారికి అత్యవసర చికిత్సలు అందజేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి ఉండేలా ఏర్పాట్లు చేశారు. స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు వీలుగా చెవి, ముక్కు, గొంతు వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు, ప్రసూతి వైద్యనిపుణులు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, జనరల్ సర్జరీ వైద్య నిపుణులను రోజుకొకరు చొప్పున అందుబాటులోకి తీసుకువచ్చారు.

అందుబాటులో 60 రకాల పరీక్షలు

ప్రస్తుత పరిస్థితుల్లో రక్త, షుగర్ పరీక్షలు చేసుకోవాలంటే వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలు ఆధునీకరించిన తర్వాత సుమారు 60 రకాల పరీక్షలు నిర్వహించేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పరీక్షల నిమిత్తం పేదలు ల్యాబ్‌లకు పరిగెత్తాల్సిన అవసరం లేకుండా పోయింది. పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను డిజిటలైజేషన్‌లో భాగంగా లబ్ధిదారుల డేటాబేస్‌లో భద్రపరచడంతో వాటి హిస్టరీ అందుబాటులో ఉంటుంది. ఇదొక విప్లవాత్మక మార్పుగా భావించవచ్చు.

వైద్యం బాగుంది



పీహెచ్‌సీలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరించడంతో మంచి వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో వరదయ్యపాళెం, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ప్రాంతాలకు ప్రతి చిన్న విషయానికి పరిగెత్తాల్సి వచ్చేది. ఇప్పుడు ఆధార్ కార్డు తీసుకెళ్తే చాలు మన హిస్టరీ అంతా వైద్యులకు అర్థం అవుతుంది. గతంలో చిట్టీలు జాగ్రత్తగా దాచుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– వెంకటేష్, చిన్న పాండూరు

రూ. 1.87కోట్లతో కొత్త పీహెచ్‌సీ భవనం



చిన్న పాండూరులో కొత్త పీహెచ్‌సీని రూ.1.87కోట్లతో నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పీహెచ్‌సీలో ఆధునిక వసతులు కల్పించాం. ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయి. స్పెషలిస్ట్ వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

– సామర్ల భువనేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు

అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి..



పీహెచ్‌సీలకు రోజుకు ఒక స్పెషలిస్టు డాక్టర్ వస్తున్నారు. ఆ రోజు సంబంధిత వ్యాధితో బాధపడేవారు వచ్చి పరీక్షలు జరిపించుకుంటున్నారు. అన్ని రకాల పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి మరింత మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి రుయా, ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తాం. 24గంటలు పని చేసే స్థాయి కలిగిన చిన్న పాండూరు పీహెచ్‌సీకి రోజుకి 200 పైగా ఓపీకి వస్తుంటారు.

– డాక్టర్ లావణ్య, వైద్యాధికారి, చిన్న పాండూరు పీహెచ్‌సీ

ఘనంగా గంగమ్మ జాతర



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మైక్రోవేవ్ స్టేషన్ కాలనీ గ్రామదేవత గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి నివేదించారు. అంబళ్లు పోశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



పొంగళ్లు పెడుతున్న మహిళలు

విద్యార్థులకు చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని తూర్పువీధిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈనెల 7వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రానున్నది జగనన్న ప్రభుత్వమే



నాయకులతో నూకతోటి రాజేష్

నాగలాపురం: రాష్ట్రంలో రానున్నది జగనన్న ప్రభుత్వమే అని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రానున్నది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కౌంటింగ్ నేపథ్యంలో ఎవరుకూడా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని పార్టీశ్రేణులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యాపార సంఘం కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్ సీపీ వార్డు మెంబరు ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, మహేష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, శ్యామ్, ఉదయకుమార్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలే న్యాయ నిర్ణేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే గెలుపులో న్యాయ నిర్ణేతలు కానున్నారు. నియోజకవరగలో 2,48,536మంది ఓట ర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,28,549మంది, పురుషులు 1,19973మంది ఉన్నారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో మహిళలు 1,05,930 మంది, పురుషులు 1,00,982 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కన్నా మహిళలు అధికంగా 5వేల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ ఫలాలు, ఇంటి స్థలాలు పొందిన మహిళలు జగనన్న వైపు మొగ్గినట్లు చెప్పకనే చెబుతున్నాయి. ఈ ఓట్లే ఫలితాల్లో కీలకంగా మారి వైఎస్సార్ సీపీకి మంచి ఫలితాలు ఇస్తాయని ఆపార్టీ నేతలు ఆశిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ఇలా సాగుతుంది

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 21 రౌండ్లపాటు లెక్కింపు జరుగనుంది. ఉదయం మొదటగా పోస్టల్‌బ్యాలెట్లను లెక్కిస్తారు. తరువాత ఈవీఎంల ఓట్లను లెక్కిస్తారు. మొదట రౌండ్‌లో శ్రీకాళహస్తి మండలం మన్నవరం నుంచి కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. 46 పంచాయతీల తరువాత పట్టణంలోని 35వార్డుల ఓట్లను లెక్కిస్తారు. అనంతరం రేణిగుంటటౌన్, ఏర్పేడు మండలం, చివరగా తొట్టంబేడు మండల ఓట్లను లెక్కిస్తారు. శ్రీకాళహస్తి మండల నుంచి ప్రారంభమయ్యే ఈ లెకిక్కంపు తొట్టంబేడు మంలం బోనుపల్లితో ముగుస్తుంది.

కాలుష్యం కమ్మేస్తోంది..

- పొగచూరుతున్న పల్లెలు
- రసాయన పొగను వదులుతున్న ఫ్యాక్టరీలు



రాచగున్నేరి సమీపంలోని ఓ కర్మాగారం నుంచి వెలువడుతున్న రసాయన పొగ

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలోని కొన్ని ఫ్యాక్టరీ యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా రసాయన వ్యర్థాలను పొగ గొట్టాల ద్వారా వదులుతుండడంతో పరిసరాలు కలుషితమవుతున్నాయి. రాచగున్నేరి సమీపంలోని ఓ కర్మాగారం నుంచి నిత్యం పొగ వదులుతున్నారు. దీంతో ఆ పరిసరాలన్నీ నల్లగా మారిపోయి కలుషితమవుతున్నాయి. ఈ ప్రాంతంలో మంచినీరు కూడా రంగుమారిపోయిందని స్థానికులు వాపోతున్నారు. అలాగే కాపుగున్నేరి సమీపంలోని శీతల పానీయాల తయారీ పరిశ్రమ నుంచి గొట్టాల ద్వారా పొగను విపరీతంగా వదులుతున్నారు. మండలంలోని ఊరందూరు సమీపంలోని పారిశ్రామికవాడలోనూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటించకుండా పలు పరిశ్రమలు విషవాయువులను జనంపైకి వదిలి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. అధికారులు తనిఖీలు చేసి కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్కిట్ కళాశాలలో 2008–12 విద్యాసంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మురళి, సాజిద్, చేతన్, చంటి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పదో తరగతి తెలుగు పుస్తకంలో తిరుపతి జాతర



తిరుపతి కల్చరల్: ఈ ఏడాది నుంచి కొత్తగా మారిన పదవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో తిరుపతి గంగజాతరకు ప్రత్యేక చోటు లభించింది. అత్యంత ప్రాచీన చరిత్ర కలిగి సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలిగా భక్తకోటి పూజలతో విరాజిల్లుతున్న శక్తిస్వరూపిణి తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏడు రోజులపాటు విశేష జానపద వేషాలతో, అత్యంత భక్తితో భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకోవడం గంగ జాతర అత్యంత విశేషమైంది. ఇంతటి విశిష్టత కలిగిన తిరుపతి గంగజాతరను సైతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర పండుగగా గౌరవం లభించింది. ప్రస్తుతం పదో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో చేర్చి తిరుపతి గంగమ్మ జాతరకు మరింత విలువను, గౌరవాన్ని కల్పించారు. పదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో తిరుపతి గంగజాతర విశేషంపై విద్యార్థులకు తెలిసేలా పాఠ్యాంశంగా పెట్టడం అభినందనీయమని ప్రముఖ కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన 15వ ఏట నుంచి ఇప్పటి వరకు ప్రతి ఏటా తాతయ్యగుంట గంగమ్మ జాతరను చూస్తూనే ఉన్నానని పేర్కొన్నారు. చిన్నప్పుడు వేషాలు వేశాను, ఏడు కొండలు వెంకన్న పాదాల చెంత జరిగే ఈ జాతర నిజంగా ఒక అద్భుతమని తెలిపారు. రోజుకొక వేషం, ప్రత్యేక అలంకరణతో పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ రకాల వేషాలు ధరించి అందరినీ కనువిందు చేసే గంగమ్మ జాతరకు గుర్తింపు రావడం గర్వకారణమని తెలిపారు. నేటి బాలలకు చరిత్ర తెలిసేలా పాఠ్య పుస్తకంలో తిరుపతి గంగజాతరను పొందపరిచిన విద్యాశాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టారు. ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం





శ్రీకాళహస్తి మండలంలో ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్ల కింద దుక్కులు దున్ని వరినాట్లు వేస్తున్నారు. మెట్టప్రాంతాల్లో సైతం వేరుశనగ, చెరుకు వంటి ఆరుతడి పంటలను సాగుచేస్తున్నారు. ఈ సీజన్‌లో మండలంలో 7వేల హెక్టార్లలో వరి సాగు లక్ష్యంకాగా ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నాట్లు వేసేందుకు కూలీల కొరతతో రైతులు కొంత అవస్థలు పడుతున్నారు.

–శ్రీకాళహస్తి